క్లుప్తంగా

వేణుగోపాలుని ఆలయంలో అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

కార్వేటినగరం : మండల కేంద్రంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం అన్నదానం చేపట్టారు. టీటీడీ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నారాయణవనం గ్రామానికి చెందిన రవి తన కుమార్తె స్నేహ పుట్టిన రోజును పురస్కరించుకుని భక్తులకు అన్నవితరణ చేశారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఆలయంలో నిర్వహించే అన్నదానంలో భక్తులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న 'లక్కాగృహ దహనం'



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

కార్వేటినగరం : ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీవెంకటేశ్వర నాటక కళామండలి వారు ప్రదర్శించిన లక్కాగృహ దహనం నాటిక ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. రజకులు ఉభయకర్తలుగా సమర్పించిన సారెతో ద్రౌపదీదేవి, ధర్మరాజస్వామి, శ్రీకృష్ణుని ఉత్సవర్లను అలంకరించారు. అనంతరం వైభవంగా గ్రామోత్సవం జరిపించారు. భక్తులు కర్పూరహారతులతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం లక్కాగృహ దహనం ఘట్టాన్ని భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా కాలక్షేపంలో విపులంగా వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, సభ్యులు కె.హరిబాబు, ఎ.శివప్రకాష్. ఎ.బాబురెడ్డి, ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఎక్కడ ?

గూడూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నామని చెబుతోందని, ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు వెళితే తడిసి మోపెడు అవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ దుయ్యబట్టారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఆదివారం సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు వెళితే అక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు పడుతోందని తెలిపారు. ఉచితంగా ఎలా ఇస్తారో కూటమి ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా అయితే భవన నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింటుందని, పనులు లేక కూలీలు ఇబ్బందులు పడతారని వివరించారు.

కూరగాయల సాగుపై ఆసక్తి



పన్నూరులో సాగవుతున్న వంగతోట

విజయపురం : మండలంలోని రైతులు కూరగాయల సాగుపై అధిక ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా విజయపురం, మాధవరం, ఆలపాకం, కోసలనగరం, మహారాజపురం, నార్పరాజుకండ్రిగ, మల్లారెడ్డికండ్రిగ తదితర గ్రామాల్లో సుమారు 30 ఎకరాలకు పైగా రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. ఇక్కడ సాగు చేసిన కూరగాయలను తమిళనాడులోని తిరుత్తణి, కోయంబేడు మార్కెట్‌కు తరలించి మంచి ఆదాయం పొందుతున్నారు. ప్రతి రోజు కోయంబేడు మార్కెట్ నుంచి వాహనం వచ్చి రైతు సాగు చేసిన కూరగాయలను కొనుగోలు చేయడంతో రైతులకు రవాణా ఖర్చు కూడా తగ్గుతోందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే ఇక్కడ అధిక మొత్తంలో కూరగాయల సాగు చేస్తున్నారు.

వరసిద్ధుని సన్నిధిలో డీజీపీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం డీజీపీ ద్వారక తిరుమలరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అనంతపురం రేంజ్ డీఐజీ షీముషి, జిల్లా ఎస్పీ మణికంఠచందోలు, ఏఎస్పీలు, డీఎస్పీలు, ఆలయ అధికారులు, వేదపండితులు ఘనస్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. మూలస్థానంలోని స్వామి వారి విశిష్టతను, చరిత్రను అర్చకులు ఆయనకు వివరించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీ మహబూబ్‌బాషా, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్, సీఐ రవిశంకర్, ఎస్ఐ రామ్మోహన్, ఏఈఓ క్రిష్టారెడ్డి, హరిమాధవరెడ్డి ఉన్నారు.



డీజీపీకి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

ఖరీఫ్ ప్రారంభమై మాసం దాటింది.. ఇప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందని ద్రాక్షగానే మిగిలింది.. ఏటా సీజన్‌కు ముందే రూ.20వేలు అందిస్తామన్న చంద్రబాబు హామీ నీటి మీద రాతగా మారిపోయింది.. అధికారంలోకి వచ్చేందుకు హామీలు ఇవ్వడంలో ఉన్న శ్రద్ధ.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఉండదని మరోమారు రుజువవుతోంది.. సేద్యం పనులు మొదలెట్టేందుకు చేయూత కోసం రైతాంగం ఆశగా ఎదురుచూస్తూనే ఉంది.. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తోంది.. అన్నదాతను సకాలంలో ఆదుకోకుండా కాలయాపన చేస్తోంది.. పథకం అమలుపై కనీసం స్పష్టత కూడా ఇవ్వకుండా అయోమయానికి గురి చేస్తోంది.

జీడీ నెల్లూరు మండలంలో ఓ రైతు అప్పు చేసి సాగు చేస్తున్న వరి పంట



సాగుకు అందని భరోసా

- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ చేసిన కేంద్రం
- ఏటా రూ.20వేలు అందిస్తామన్న హామీని అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- అన్నదాతల అవస్థలను ఖాతరు చేయని వైనం
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతాంగం



వరి నాట్లకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

పాలసముద్రం : వ్యవసాయానికి అండగా నిలుస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఊదరగొట్టారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోకుండా ముఖం చాటేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద సకాలంలో పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించేది.

అయితే ఏటా రూ.20వేలు ఇస్తామని హామీలు గుప్పించిన చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టి నెల రోజులు పూర్తయినా ఇప్పటికీ పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పష్టం ఇవ్వలేదు. కేవలం రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అని మార్చడం తప్ప చేసింది ఏమీ లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా.. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం కింద తొలి విడత నగదు రూ.2వేలను రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేసేసింది.

నాడు ఆరంభంలోనే..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసేది. పెట్టుబడికి అన్నదాతలు ఏమాత్రం ఇబ్బంది పడకూడదని చిత్తశుద్ధితో సాయం అందించేది. పీఎం కిసాన్ కింద రూ.6వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతలు అన్నదాతల ఖాతాల్లో సీజన్ ఆరంభంలోనే జమ చేసేది. ఒక్క గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోనే సుమారు 43,480 మంది రైతులకు ఏడాదికి రూ.51.69 కోట్లు పంపిణీ చేసేది.

పంట రుణాలకు పాట్లు!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. దీంతో సేద్యం పనుల కోసం రైతులు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం మార్చడంలో చూపిన తొందరలో రాష్ట్ర ప్రభుత్వం సగమైనా రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో చూపించి ఉంటే సాగు సంబరంగా ఉండేది.

అన్నదాతకు అప్పులే గతి..!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా పథకం నిధులను అన్నదాతలకు అందించేది. ఈ ఏడాది కూడా మేలోనే రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన పీఎం కిసాన్ నగదు రైతులకు దుక్కులకు ఉపయోగపడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు వాడుకోవాల్సి ఉంటుంది. కానీ, కూటమి సర్కారు స్పందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

“

ఇబ్బంది లేకుండా చూడాలి



నాకు మూడు ఎకరాల భూమి ఉంది. మొదట వేరుశనగ సాగు చేశాం. విత్తనాలు మొలకెత్తక పోవడంతో మళ్లీ వరి, చెరుకు వేసుకున్నాం. సాగు ఖర్చులు పెరిగాయి. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఉచిత పంట బీమాను అమలు చేసేది. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రైతులకు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– రవిరెడ్డి, రైతు, కృష్ణజమ్మపురం

అప్పు చేయాల్సి వచ్చింది



నాకు ఎకరా భూమి ఉంది. పంటల సాగుకు పెట్టుబడిగా రూ.15వేలు అవసరం. గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల కింద ఒకేసారి డబ్బులు ఇచ్చేవారు. దాంతో పెట్టుబడికి వెతుక్కోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అప్పు చేసి పంట సాగు ప్రారంభిస్తున్నాం. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని ఈసారైనా చంద్రబాబు నిలబెట్టుకుంటే బాగుంటుంది. సకాలంలో ఇస్తేనే మాకు మంచి జరుగుతుంది.

– శేఖర్‌రాజు, రైతు, తొట్టికండ్రిగ

సండే సరదా



వాలీబాల్ ఆడాలంటే కోర్టు, ఇనుప స్తంభాలు, నెట్ అవసరం లేదు. ఆడాలన్న లక్ష్యం ఉంటే చాలు.. ఆదివారం పిల్లలు రెండు పక్కల చిన్న కొయ్యలు నాటి, అడ్డంగా దారం కట్టుకొని వాలీబాల్ ఆడారు. సెలవు రోజు ఇలా సరదాగా గడిపేశారు. - విజయపురం

తూకం.. మోసం





గ్రామాల్లోని దుకాణాల్లో వినియోగిస్తున్న పాత కాటాలు, తూనిక రాళ్లు

గుడిపాల: ఎలక్ట్రానిక్ కాటాలు, కంప్యూటరైజ్డ్ తూనికలు తప్పనిసరిగా వినియోగించాలన్న నిబంధనలు ఉన్నా పలు దుకాణాల్లో తూనిక రాళ్లతో మోసం చేస్తున్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటికీ సంప్రదాయ కాటాలనే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాలను ఉపయోగించాలి. కానీ రాళ్లను కేజీ లెక్క చూపించి తూకాలు నిర్వహిస్తూ వినియోగదారులను ముంచేస్తున్నారు. తూనిక రాళ్లను ప్రతి రెండేళ్లకు ఓసారి తూనికలు, కొలతల విభాగం వారిచే సరిచేయించి ముద్ర వేయించుకోవాలి. ఇది మండలంలో ఎక్కడా జరగడం లేదు. అధికారులకు మామూళ్లు అందడమో లేక నిర్లక్ష్యమో తెలియదు కానీ నిబంధనలు మాత్రం అమలుకు నోచుకోలేదు. గ్రామాల్లో ఆయా సీజన్‌ల బట్టి దుకాణాల్లో వ్యాపారం జరుగుతుంది. అంతేగాకుండా కూరగాయలు, పండ్లు తదితర వ్యాపారాలు ద్విచక్ర వాహనాలు, రోడ్లకు ఇరుపక్కలా బండ్లపైన అధికంగా సాగుతోంది. అరిగిపోయిన రాళ్లను ఉపయోగించి వ్యాపారులు మోసానికి పాల్పడడంతో వినియోగదారులు నిత్యం నష్టపోతున్నారు. ఎలక్ట్రికల్ కాటాలతో సైతం వ్యాపారులు అక్రమాలకు తెరతీస్తున్నారు. ముందుగా వందగ్రాములు తగ్గించి జీరో వచ్చేలా అమర్చుతున్నారు. కొన్ని దుకాణాల్లో కాటాపై ఉన్న పళ్లెం బరువును లెక్కించకుండా తూకంలో కలిపేసి మోసాలకు పాల్పడుతున్నారు. కేజీకి 50గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు అధికశాతం దుకాణాల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. కొద్దిరోజుల కిందట తూనికలు, కొలతల శాఖాధికారులు మండలంలో నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకున్నారు. తనిఖీలు చేసిన ప్రతిచోటా వ్యత్యాసం ఉండడంతో ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు.

కండలేరులో 6.303 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి కండలేరు జలాశయానికి 80 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీకి అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమైంది. ఉదయం నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తిచేసిన అర్చకులు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. గంగాళంలోని జలంలో త్రిశూల స్నానం చేయించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలు, నైవేద్య సమర్పణ అనంతరం ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అవరోహణం చేయించారు. ఉత్సవాలను నిర్వహించిన అర్చకులను బహుమానంతో సత్కరించారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జిత అధికారి భరత్ పర్యవేక్షించారు.

కాళికాపురంలో పారిశుధ్య పనులు





కాళికాపురంలో బ్లీచింగ్ చేస్తున్న దృశ్యం, మల్లారెడ్డికండ్రిగలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

విజయపురం : మండలంలోని కాళికాపురంలో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ గంగమాంబపురం, కాళికాపురంలో ఓవర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయించారు. మురుగునీటి కాలువలో బ్లీచింగ్ చేశారు. గ్రామంలో ఉన్న పేడ దిబ్బలను తొలగించారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మల్లారెడ్డికండ్రిగలో ఓవర్ ట్యాంక్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీ ద్వారా తొలగించారు.

బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత

పాలసముద్రం : గ్రామీణ ప్రాంతాల్లో బాధ్యతగా పరిసరాల పరిశుభ్రతకు పనిచేయాలని పారిశుధ్య కార్మికులను ఎంపీడీఓ రామనాథరెడ్డి ఆదేశించారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి ధరణి, సర్పంచ్ అయ్యప్పతో కలిసి పాలసముద్రంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. సర్పంచ్ అయ్యప్ప మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ చేరిందని, దోమలు వ్యాప్తి చెందే ప్రమాదముందని హెచ్చరించారు. వర్షపు నీటికి ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. అలాగే మలాథియాన్ మందును పిచికారీ చేయాలని కోరారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలని చెప్పారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.

పోస్టర్ పెయింటింగ్‌లో ప్రథమ స్థానం



పోస్టర్ పెయింటింగ్‌లో బహుమతి పొందిన విద్యార్థులు

నగరి : పట్టణంలోని వే ఫౌండేషన్, రీజినల్ సైన్స్ సెంటర్ తిరుపతి వారు సంయుక్తంగా నిర్వహించిన పోస్టర్ పెయింటింగ్ పోటీలో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం కొత్త వెబ్‌సైట్ లాంచింగ్‌లో భాగంగా మొక్కల పెంపకం దాని సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో నగరి మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కెవెల్ సంధ్య, ఎస్‌జి లతిక పోస్టర్ పెయింటింగ్ చేశారు. విద్యార్థుల పెయింటింగ్‌కు ప్రథమ బహుమతి లభించింది. విద్యార్థులకు, గైడ్ టీచర్‌కు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ముసుగేసిన ముసురు



నగరి పట్టణంలో కురుస్తున్న వర్షం



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నిల్వ ఉన్న నీరు

నగరి: వారం రోజుల పాటు పగటి పూట తుంపర్లు, రాత్రి పూట మెరుపులు, పిడుగుల శబ్దంలో వర్షం అంటూ వరుస వర్షాలు కురుస్తూనే ఉంది. నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న కొన్ని రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచిస్తోంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి నగరి నియోజకవర్గం వ్యాప్తంగా చినుకులు పడుతూనే వర్షాలు కురుస్తూ వాతావరణం అనుకూలంగా మారడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని నగరి, నింద్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేటల్లో 63.65 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయ్యాయి. వర్షాలు వరుసగా కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. దీనికి తోడు ఆదివారం కావడంతో ఎక్కువ మంది చిరు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. దీంతో మెయిన్ రోడ్డులో జన సంచారం తగ్గింది.

సమ్మర్ స్టోరేజీలో పెరిగిన నీటిమట్టం

ఆదివారం ఉదయానికి నగరి నియోజకవర్గంలో 29.24 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదు కాగా గత వారం రోజుల్లో సరాసరి వర్షపాతం 48.76గా నమోదైంది. మండలాల వారీగా నగరిలో 21.2 మిల్లీ మీటర్ల నుంచి 61.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నింద్రలో 18.2 నుంచి 37.4 మిల్లీ మీటర్లుగా నమోదైంది. విజయపురంలో 27.4 నుంచి 42.6 మిల్లీ మీటర్లు, పుత్తూరులో 25.3 నుంచి 59.2 మి.మీ., వడమాలపేటలో 20.5 నుంచి 42.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షం కురిసింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిండింది. నగరి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి మట్టం పెరిగింది. సాయంత్రం నుంచి పడే తుంపర్లు, వర్షానికి పట్టణంలోని తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు అమ్మకాలు లేక, ఇటుక బట్టీలు వేసుకునేవారు పనులు చేపట్టలేక ఇబ్బందులు పడ్డారు.

కనీస వేతనాలివ్వాల్సిందే!

- కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్

రేణిగుంట: 'కబళిస్తున్న కాలుష్యం– ప్రాణాలకు లేదు అభయం' పేరిట ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను చెల్లించి వారికి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ఆయా కంపెనీల యాజమాన్యాలకు ఉందని కార్మికశాఖ తిరుపతి ఉప కమిషనర్ బాలునాయక్ స్పష్టం చేశారు. ఆయన ఆదివారం సాక్షితో మాట్లాడుతూ జిల్లాలోని పలు పరిశ్రమలు, ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు వారి పనిని బట్టి కనీస వేతనాలను చెల్లించాలన్నారు. స్థానికులైనా, బయట రాష్ట్రాలకు చెందిన వారైనా వేతనాల విషయంలో వ్యత్యాసాలుంటే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క రోజులో 8గంటల కంటే ఎక్కువగా పనిచేయించుకున్నా చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు చేసి కార్మికుల భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు తమకు నేరుగా ఫిర్యాదు చేస్తే ఆ కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.